# గులాబీ అడ్డాగా కూకట్‌పల్లి

- ప్రతిష్ఠాత్మక పోరులో కృష్ణారావుదే విజయం
- నాన్ లోకల్ వద్దూ.. లోకల్ ముద్దంటూ ఓటర్ల తీర్పు
- అభివృద్ధి సంక్షేమ పథకాలు, స్థానికత అంశాలే గెలుపునకు బాటలు
- బీఆర్ఎస్‌కు అండగా నిలిచిన సెటిలర్లు.. తెలంగాణ వాదులు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 4 : తెలుగు రాష్ట్రాలలో ఉత్కంఠ రేపిన కూకట్‌పల్లి నియోజకవర్గంలో గులాబీ పువ్వు వరుసగా రెండోసారి వికసించింది. స్వరాష్ట్రంలో మొదటిసారి జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గంలో తొలిసారి బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరగా తర్వాత జరిగిన అసెంబ్లీ.. రెండోసారి జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికలు.. మూడోసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఆదరిస్తుండడంతో గులాబీ జెండాకు అడ్డాగా మారింది కూకట్‌పల్లి. పదేండ్ల కాలంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలతో పాటు ఎళ్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ కూకట్‌పల్లిని ఆదర్శవంతంగా అభివృద్ధి చేసిన మాధవరం కృష్ణారావుకు 71వేలకు పైగా ఓట్లువేసి భారీ మెజార్టీని అందించారు. బీఆర్ఎస్‌ను ఓడించేందుకు కాంగ్రెస్, జనసేన పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు వేసిన ఎత్తులన్నీ చిత్తయ్యాయి. కూకట్‌పల్లిలో కాంగ్రెస్ గెలుపు కోసం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు కర్ణాటక నుంచి పలువురు నాయకులు.. జనసేన గెలుపు కోసం పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ లు రంగంలోకి దిగి ప్రచారాలు చేసినా ఓటర్లు కృష్ణారావుకే మద్దతు తెలిపారు. నియోజకవర్గంలో దశాబ్దాల కాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్, తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపిన కృష్ణారావునే ప్రజలు గుండెల్లో నిలుపుకున్నారు. వేలాది కోట్లతో చేసిన అభివృద్ధి, అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించడం, ప్రతి రోజూ 6 గంటలకే ప్రజలకు అందుబాటులో ఉండడం.. అన్నా అంటే నేనున్నానంటూ కార్యకర్తలు, నాయకులకు ఎల్లవేళలా భరోసానివ్వడం, సీమాంధ్రులతో పాటు తెలంగాణ వాదులు, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ వర్గాలకు సమ ప్రాధాన్యతనివ్వడం, బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులతో సత్సంబంధాల కారణంగా బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించిందని చెప్పుకోవచ్చు.

**బీఆర్ఎస్‌కు అండగా అన్ని వర్గాలు..**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో లక్ష యాభై వేలకు పైగా ఉన్నటువంటి సెటిలర్లు ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలిచారు. సీమాంధ్రకు చెందిన రెడ్డి, కమ్మ, కాపు, తెలంగాణ రెడ్డి సామాజిక వర్గాలతో పాటు క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలకు చెందిన మెజార్టీ ఓటర్లు కారు గుర్తుకు ఓటేశారు. మరోవైపు తెలంగాణ వాదులంతా కేసీఆర్ పరిపాలన దక్షత, కాంగ్రెస్, జనసేన అవకాశవాద రాజకీయాలను గమనిస్తూ మూకుమ్మడిగా బీఆర్ఎస్ గెలుపు కోసం పనిచేశారు. కూకట్‌పల్లిలో రెండు సామాజిక వర్గాల ఓట్లపై ఆశతో అడుగుపెట్టిన ప్రతిపక్ష నేతలకు అడుగడుగునా ఆటంకాలే ఎదురయ్యాయి. నియోజకవర్గ హద్దులు తెలియకపోవడం, స్థానిక పరిస్థితులపై అవగాహన లేకపోవడం, ఆ రెండు సామాజిక వర్గాలకు చెందిన నేతలకే ప్రాధాన్యతనివ్వడం, కూకట్‌పల్లికి సంబంధంలేని నాయకులకు ప్రచార బాధ్యతలు అప్పగించడం.. చివరాఖరుకు డబ్బులు, మద్యం లాంటి ప్రలోభాలకు కూడా ఓటర్లు లొంగకపోవడం లాంటి కారణాలతో కాంగ్రెస్, జనసేన పార్టీలు చిత్తుగా ఓడిపోయాయి.

## జేఎన్‌టీయూహెచ్‌లో హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్ జట్లు ఎంపిక

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 4 : జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో సౌత్‌జోన్ మెన్ హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్ జట్టులకు క్రీడాకారులను ఎంపిక చేశారు. వర్సిటీలో జరిగిన ఈ ఎంపిక పోటీలకు వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ఓఎస్‌డీ బాలునాయక్, వర్సిటీ పరీక్షల విభాగం అధిపతి కె.వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని.. హ్యాండ్‌బాల్ క్రీడాకారుల జట్టు కెరళా కొట్టాయంలో జరిగే మహాత్మాగాంధీ వర్సిటీలో జరిగే ఫైనల్ పోటీలలో పాల్గొంటారని.. బ్యాడ్మింటన్ జట్టులు చెన్నైలో జరిగే పోటీలలో పాల్గొంటారని వర్సిటీ సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ దిలీప్, కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ నల్లగొండ అశోక్ లు తెలిపారు.

## చిన్నారులకు నచ్చిన రంగంలో ప్రోత్సహించాలి

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 4 : పాఠశాల దశలోనే చిన్నారుల ప్రతిభను గుర్తించి ఆయా రంగాల్లో రాణించేందుకు ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లి దండ్రులపై ఉందని సైంటిస్ట్ నేహ హెబాల్కర్ అన్నారు. సోమవారం బాలాజీనగర్ డివిజన్‌లోని కైత్లాపూర్ గ్రౌండ్‌లో జరిగిన క్రీక్ ప్లానెట్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా సైంటిస్ట్ నేహ హెబాల్కర్, పాఠశాల వైస్ చైర్మన్ పాండురంగాచారీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాస్మిక్ లామ్ బి గస్ ద వే అహెడ్ అన్న హితివృత్తంతో చిన్నారుల నృత్య ప్రదర్శనలు వీక్షలకు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంపాగోయెల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు.

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..

- ప్రతిపక్షంలో ఉండైనా అభివృద్ధికి కృషి చేస్తా..
- అత్యధిక మెజార్టీతో గెలిపించడం పట్ల ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కృతజ్ఞతలు
- ఎమ్మెల్యేకు వెల్లువెత్తిన అభినందనలు



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు ఆశీర్వచనాలు అందిస్తున్న వేదపండితులు

కుత్బుల్లాపూర్,డిసెంబర్4: కుత్బుల్లాపూర్ ప్రజలు తనను నమ్మి భారీ మెజార్టీతో గెలిపించిన కృతజ్ఞతను మరువనని, ప్రతిపక్షంలో ఉండైనా నియోజకవర్గాన్ని, ప్రజలకు కావాల్సిన అన్నీ రకాల మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నిర్వీరామంగా పని చేస్తానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన కేపీ వివేకానంద్‌ను సోమవారం నియోజకవర్గ పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక వేదపండితుల సమక్షంలో ఆశీర్వదనలు స్వీకరించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పేట్ బషీరాబాద్‌లోని తన నివాసంలో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో తన గెలుపునకు కృషి చేసిన ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో పాటు సంక్షేమ, స్వచ్ఛంద, యువజన సంఘాల ప్రతినిధులు ముఖ్యంగా తనపై నమ్మకం ఉంచి భారీ మెజార్టీతో హ్యాట్రిక్ సాధించిన నియోజకవర్గ ప్రజాణికానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్నీ రంగాల్లో అభివృద్ధి చేశామని, ఇంకా అభివృద్ధి చేయాల్సిన కర్తవ్యం, బాధ్యతను ప్రజలు తనకు ఇవ్వడంతో మరింత ఉత్సాహం నింపిందని, ఇదే స్ఫూర్తితో ప్రతిపక్షంలో ఉండైనా నియోజకవర్గాన్ని మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచనతో పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలగోపాల్ రెడ్డి, కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, మాజీ ఎంపీపీలు చినంగి వెంకటేశం, సన్న కవితశ్రీశైలం, భౌరంపేట్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ నాగరాజ్‌యాదవ్‌తో పాటు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ నాగరాజ్‌యాదవ్ తదితరులు



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి తదితరులు

## మాధవరానికి శుభాకాంక్షలు



కృష్ణారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ సబీహబేగం



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న తూము శ్రావణ్‌కుమార్



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ కార్పొరేటర్ బాబూరావు



ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతున్న బీఆర్ఎస్ పార్టీ నేతలు కర్క పెంటయ్య, కర్క నాగరాజు తదితరులు



ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతున్న రెయింబో విస్తాస్ రాక్ గార్డెన్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మధుసూదన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నేతలు



ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతున్న బీఆర్ఎస్ పార్టీ యువనాయకులు సాయిశ్రీనివాస్, నానీ తదితరులు

## విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు..



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

దుండిగల్,డిసెంబర్ 4: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి పాఠశాలలో ప్రగతిలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'పీస్ పోస్టర్' పేరిట నిర్వహించిన డ్రాయింగ్ పోటీలకు విశేషస్పందన లభించింది. డేర్ టూ డ్రీం అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలో వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి పాఠశాలకు చెందిన 6,7,8వ తరగతులకు చెందిన సుమారు 300మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో లయన్స్ పీస్ పోస్టర్ కాంటెస్ట్ డిస్ట్రిక్ట్ చైర్మన్, లయన్ సత్యవోలు రాంబాబు, పాఠశాల డైరెక్టర్ విజయరాణి, లయన్స్ డా. ఎంఆర్ఎస్.రాజు, ఎల్లా సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.